క్లుప్తంగా

'వందేభారత్'కు ఘన స్వాగతం



బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు శనివారం ఘన స్వాగతం లభించింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ ప్రారంభించిన సందర్భంగా ప్రయాణికుల సందర్శనార్థం బిట్రగుంటలో కొద్దిసేపు నిలపనున్నట్లు రైల్వే అధికారులు రెండు రోజుల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సాయంత్రం ఐదు గంటల నుంచే స్థానికులతో రైల్వేస్టేషన్ ప్రాంగణం కిటకిటలాడింది. వేలాదిగా తరలివచ్చిన బిట్రగుంట వాసులు, రైల్వే కార్మికులు, విశ్రాంత రైల్వే ఉద్యోగులు పూలు జల్లుతూ వందేభారత్‌కు ఘనస్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వీకే శీనానాయక్ బిట్రగుంటలో వందేభారత్‌కు పచ్చజెండా ఊపి నెల్లూరు వరకు ప్రయాణించారు.

కనులపండువగా పార్వేట ఉత్సవం

వింజమూరు (ఉదయగిరి): శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పార్వేట ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉభయకర్త వెలుగోటి రాములు ఇంటి నుంచి చెన్నకేశవస్వామి దేవస్థానానికి ఊరేగింపుగా భజంత్రీలు, బాణసంచా పేలుస్తూ కనుల పండువగా సాగింది. అనంతరం స్వామివారిని, అమ్మవారిని అశ్వ వాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చెన్నకేశవ స్వామి దేవస్థానం నుంచి ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న జమ్మి చెట్టు వరకు ఉత్సవ ఊరేగింపు జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

సీఐ కుటుంబానికి పరామర్శ

ఆత్మకూరు: ఇటీవల తీవ్ర గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆత్మకూరు సీఐ ఎం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లిలోని సీఐ ఇంటి వద్దకు వెళ్లి ఆయన భార్య, మిగిలిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ పరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ని త్వరగా అందేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట సంగం సీఐ రవినాయక్, ఎస్సై ఎం.శివశంకర్ రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, తోకల వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రీడల్లోనూ సత్తా చాటాలి

కావలి: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటి కావలి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా లెదర్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. యువతతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో పాటు ఉద్యోగాల పరంగా కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కావలి రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు ఈతముక్కల బాలమురళీరెడ్డి, నాయకులు కుందుర్తి కామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన సిద్ధాంతికి ఘన సన్మానం

ఆత్మకూరు: శృంగేరి విరూపాక్షపీఠం ఆస్థాన సిద్ధాంతి జాగర్లపూడి స్రవంతిని బ్రాహ్మణ సేవా సంఘం, గాయత్రి సేవా సహకార ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రఖ్యాత విరూపాక్షపీఠం ఆస్థాన సిద్ధాంతి కావడం గొప్ప విషయమని, దీనికి తోడు పంచాంగం రాసిన మొదటి మహిళగా ఆమె పేరు తెచ్చుకుందని కొనియాడారు. చక్రవర్తి, సంగీత నృత్య విద్యాలయం నిర్వాహకురాలు అపర్ణ, రామయ్యస్వామి, నాగరాజాశర్మ మధుసూదన్ శర్మ పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు

అనుమసముద్రంపేట: మండలంలోని కొత్తపల్లిలో ఆగ్నేష్ మల్టీ పర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్, అఫెన్స్ కంట్రోల్ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ కానగల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఆఫ్ ఆగ్నేస్ చారిటబుల్ ఫౌండేషన్ వారి సహకారంతో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ కోశాధికారి పద్మావతి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కొత్తపల్లి ఎంపీటీసీ సూరా వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ చిచ్చు ఓబులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకా కృష్ణారెడ్డి, స్థానిక సచివాలయం ఏఎన్ఎం శేషమ్మ, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

కమనీయం కోదండరామస్వామి రథోత్సవం



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నేత్రపర్వంగా శనివారం జరిపారు. సీతా, లక్ష్మణ, హనుమంత సమేత కోదండరామస్వామి సర్వాలంకారశోభితంగా కొలువై భక్తులను అనుగ్రహించారు. మూలవర్లు, ఉత్సవమూర్తులకు పూజలు, తిరుమంజనాన్ని మందిర ప్రధానార్చకుడు విశ్వనాథ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత రథోత్సవాన్ని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ప్రారంభించారు. ఉత్సవాలకు ఉభయకర్తలుగా కైలాసపతి, శ్రీహరిప్రసాద్‌రావు, సాయిమౌళి, జగన్‌మోహన్‌రావు వ్యవహరించారు. భక్తులకు పులిహోర, పొంగలి, తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రమణకుమార్, వెంకటరమేష్, కామేశ్వరరావు, జ్యోతిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పద్మప్రియ, సునీత, ఈఓ దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా..



నెల్లూరు రూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పొట్టేపాళెంలోని కోదండరామ స్వామి ఆలయంలో రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పల్లకిసేవను రాత్రి జరిపారు.

సోఫాల గోడౌన్లో అగ్నిప్రమాదం

నెల్లూరు సిటీ: సోఫాలు తయారు చేసే గోడౌన్లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. చంద్రబాబునగర్‌కు వెళ్లే రహదారిలో సోఫాలు తయారీ చేసే గోడౌన్‌ను సంతోష్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోఫాలను బయట తయారు చేస్తుండగా, గోడౌన్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేలోపే సోఫాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.20 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిత్యావసర సరుకుల అందజేత

నెల్లూరు (టౌన్): వేదాయపాళెంలోని స్వర్ణదీపం ట్రస్ట్‌కు బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. విజయభాస్కర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఆయన కుటుంబసభ్యులు చేపట్టారు. సంపూర్ణ, షణ్ముఖ శ్రీనివాస్, కృష్ణచైతన్య, కిరణ్మయి, చరిత్‌కృష్ణ, సంజయ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా క్రీడా పోటీలు

నెల్లూరు (టౌన్): నగరంలోని జెనెక్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్ రేస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు మాట్లాడారు. చదువుతో పాటు మానసికోల్లాసం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఎమ్మెల్సీ అభినందన

నెల్లూరు (టౌన్): నగరంలోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సోనియా ప్రదర్శించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపిక కావడంపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో సోనియాకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, పాఠశాల కరస్పాండెంట్ సుమయ తబస్సుమ్, గైడ్ టీచర్ జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా గంధ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): కామాటివీధిలోని హజరత్ సయ్యద్ షా మక్బూద్ అలీ హుస్సేనీ రజ్వీ చిష్టియల్ ఖాదరి గంధ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. జెండావీధి నుంచి కామాటివీధికి గంధం ఫకీర్ల జరబుల నడుమ శనివారం తెల్లవారుజామున చేరింది. నిర్వాహకుడు రియాజ్ అహ్మద్ రజ్వీ, ముస్లిం యూత్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఖాలిద్, ఫయాజ్, రియాజ్, ఖలీల్, నవాజ్, తదితరులు పర్యవేక్షించారు.



'పద్మావతి'లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ

నెల్లూరు(అర్బన్): పుట్టు చెవుడుతో బాధపడుతున్న ఓ వ్యక్తికి తమ ఆస్పత్రిలో సీఐ 632 అనే పరికరంతో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసి వినికిడిని తెప్పించామని పద్మావతి ఈఎన్టీ స్పెషలిస్ట్ గంగా ప్రభంజన్ కుమార్ పేర్కొన్నారు. బృందావనంలోని ఆస్పత్రిలో రోగితో కలిసి విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. విజయవాడకు చెందిన 46 ఏళ్ల సుభాష్ చంద్రకు చిన్నతనం నుంచే చెవుడు ఉందన్నారు. ప్రొఫైల్ హియరింగ్ లాస్ జరిగి రెండు చెవుల్లో శబ్దం గ్రహించే శక్తి పోయిందని, ఇలాంటి వారికి హియరింగ్ ఎయిడ్స్ వినియోగించినా ఫలితం ఉండదని తెలిపారు. తెలిసిన వారి ద్వారా తమ ఆస్పత్రికి రాగా, అన్ని పరీక్షలు చేసి ఆపరేషన్‌ను నిర్వహించామని పేర్కొన్నారు. ఇంటర్నల్‌గా ఒక పరికరాన్ని అమర్చామని, ఎక్స్‌టర్నల్‌గా మరో పరికరాన్ని నెల తర్వాత అమర్చాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్‌ను నెల్లూరులో తొలిసారిగా తాము చేశామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రభంజన్‌కుమార్

ఘనంగా రన్ ఫర్ జీసస్

నెల్లూరు(బృందావనం): ఈస్టర్ ప్రాధాన్యాన్ని వివరించే పాటలను ఆలపిస్తూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నగరంలో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమైన కార్యక్రమం బట్వాడిపాళెంలోని తెలుగు సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వరకు కన్వీనర్ రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ ఆధ్వర్యంలో సాగింది. ఆయా ప్రధాన కూడళ్లలో పాటలు, చిన్నారుల నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. రెవరెండ్లు భాస్కరయ్య, రాజశేఖర్, ప్రేమ్‌కుమార్, హనోక్, సురేంద్రబాబు, బ్రదర్ బర్నబాస్, బ్రదర్ రాజేష్, బ్రదర్ జానీజో, జయప్రకాష్, సుహాసిని, భారతి, తదితరులు పాల్గొన్నారు.



రక్తహీనత నివారణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న పెంచలయ్య

మనుబోలు : గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య తెలిపారు. మండలంలోని పిడూరు, ఎల్ఎన్‌పురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులతో సరిపోల్చి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల రక్తహీనతను గుర్తించి ఆరు నెలల పాటు ఐరన్ మాత్రలు వాడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం తరువాత గర్భిణుల చేత ఐరన్ మాత్రలు మింగించాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, సీహెచ్ఓ రాజయ్య ఉన్నారు.

రేషన్‌షాపులో తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పాలినాయుడు చెరువు గ్రామంలో ఉన్న 36వ రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లైయ్స్, విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లైయ్స్ డీటీ మురళీ మాట్లాడుతూ ఇక్కడ అవకతవకలు జరుగుతున్నట్లు స్థానికులు తమకు ఫిర్యాదు చేయగా తాము విజిలెన్స్ ఏఈ సుధాకర్‌రెడ్డి సహకారంతో తనిఖీ చేశామన్నారు. దుకాణంలో 3,974 కిలోల బియ్యం, ఆరు కేజీల కందిపప్పు తక్కువగా ఉన్నట్లు గుర్తించగా, 350 చక్కెర ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో దుకాణ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కొడవలూరు : శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.వెంకటేశ్వర్లుకు ఆహ్వానం లభించింది. తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించే సాహితీ బ్రహ్మోత్సవాల్లో కవితాగానం, సాహిత్య సదస్సుల్లో హెచ్ఎం పాల్గొననున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మైపాడు రోడ్డులో విద్యుత్ స్తంభాలకు తీగలను మార్చనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్ నగర్, సింహపురికాలనీ, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- నగరంలోని డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ జెడ్పీ కాలనీ ఫీడర్‌లో నూతన విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో నేతాజీనగర్‌లోని 1, 2, 3, 4వ వీధుల్లో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు, అభిషేకాలను శనివారం నిర్వహించారు. తిరుప్పావైసేవ, గిరిప్రదక్షిణ చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన

నెల్లూరు (అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు కోరారు. ఈ మేరకు గాంధీబొమ్మ వద్ద పోస్టర్లను పలువురు ఉద్యోగులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళనను చేపటారు. సంఘ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, నేతలు వెంకటరమణయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఓ హోటల్లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పర్యవేక్షకులుగా సుధీర్‌బాబు, లక్ష్మణ్‌దేవ్, విజయ్ కుమార్, విశ్వనాథ్ వ్యవహరించారు. అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా నాగరాజరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణారెడ్డి, రవికుమార్, విజయ్‌కుమార్, నిర్వహణ కార్యదర్శిగా నాగమణి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, ఈసీ మెంబర్లుగా సుధీర్‌కుమార్, వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.

21వ డివిజన్లో విస్తృత ప్రచారం

నెల్లూరు రూరల్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని రూరల్ పరిధిలోని 21వ డివిజన్లో గల పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన లబ్ధిని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ గౌరి వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. జేసీఎస్ మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, నేతలు పెంచలరెడ్డి, రాజారెడ్డి, సుబ్బారావు, మాల్యాద్రి, రియాజ్, బుజ్జన్న, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

యాక్టివా చోరీ

నెల్లూరు సిటీ: హోండా యాక్టివా చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ తన బైక్‌ను ఇంటి ముందు ఈ నెల ఐదో తేదీ రాత్రి నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై స్వామివారు శనివారం దర్శనమిచ్చారు. వెణ్ణత్తాళి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా గిరిప్రసాద్, వాణి, మాలకొండారెడ్డి వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమౌళీరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

విశేషాలంకారంలో మల్లేశ్వరస్వామి



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారు అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గౌతమ్‌రెడ్డి, శరణ్య దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

వేడుకగా ఏకాంతసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో నిర్వహిస్తున్న కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి ఏకాంతసేవ, పల్లకిసేవను జరిపారు. ఉభయకర్తలుగా దయాకర్‌గౌడ్, సుబ్బరత్నమ్మ వ్యవహరించారు. రామాంజనేయ యుద్ధం – గయోపాఖ్యాన నాటక ప్రదర్శనలను లక్ష్మీచెన్నకేశవ నాట్యమండలి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

కనులపండువగా శ్రీరామపట్టాభిషేకం

నెల్లూరు(బృందావనం): బారకాస్‌లోని శ్రీరామ మందిరంలో శ్రీరామపట్టాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా భవానీశంకర్, భాగ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు హనుమంతరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఏకాంతసేవతో ముగిశాయి. ధ్వజావరోహణ, పూర్ణాహుతి, వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసరావు, వెంకటసుభాషిణి, వెంకటేశ్వర్లు, సుధామణి దంపతులు వ్యవహరించారు.

ఆంజనేయస్వామికి ఊంజల్‌సేవ

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా భాస్కర్, అరుణ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.